## క్లుప్తంగా

### ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

**గోపాలపట్నం:** ఎస్ఎస్‌టీఎల్‌లో నిర్వహించిన డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ నెల 7 నుంచి శుక్రవారం వరకూ పోటీలు జరిగాయి. ఆర్‌సీఐ హైదరాబాద్ ఎమెర్జ్‌డ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఎస్ఎస్‌టీఎల్ రన్నరప్‌గా నిలిచింది. వీరికి ట్రోఫీని నిర్వాహక కమిటీ సభ్యులు అందించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ రాము, ప్రధాన కార్యదర్శి ఎం. నారాయణరావు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వితరణ

**కంచరపాలెం:** కంచరపాలెం ముత్యమాంబ ఆటో స్టాండ్‌లో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మహేష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అల్పాహారం, విద్యార్థులకు సామగ్రి, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రవి, బుల్లిబాబు, జి.అచ్చిబాబు, డి.శ్రీను, యశ్వంత్, కిరణ్, వినోద్, తరుణ్, రాజ్‌కుమార్, వరప్రసాద్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### పొంచి ఉన్న ముప్పు!



ప్రమాదకరంగా గవర కంచరపాలెం కాలువ

**కంచరపాలెం:** జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం ప్రధాన రహదారిలో కాలువపై సిమెంటు దిమ్మెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. షిర్డీసాయిబాబా ఆలయ రహదారిలో కాలువలపై సిమెంటు దిమ్మెలు లేకపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధి లైట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇటీవల అటుగా వెళ్తూ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదం బారిన పడ్డాడు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలపై సిమెంటు దిమ్మెలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

### వ్యక్తిపై చీటింగ్ కేసు

**మల్కాపురం:** ఓ మహిళ వద్ద డబ్బులు వసూలు చేసి అవి సంస్థలో కట్టకుండా తన వద్ద పెట్టుకున్న వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదైంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 40వ వార్డు ఏకేసీ కాలనీలో నాలుగేళ్ల కిందట నున్న గోపాలలక్ష్మి అనే మహిళ తన కుటుంబంతో కలిసి నివసించేది. ఇదే ప్రాంతంలో ఆమెకు వరసకు మేనమామ అయిన కరణం వెంకటరావు అనే వ్యక్తి నివసించేవాడు. ఇతడు సహారా కంపెనీలో ఏజెంట్‌గా పనిచేసేవాడు. సహారా సంస్థలో డబ్బులు వేస్తానని చెప్పి తన మేనకోడలు గోపాలలక్ష్మి వద్ద వెంకటరావు రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్, నెలకు రూ.1,000 చొప్పున కట్టించుకునేవాడు. నెలవారీ కట్టే డబ్బులు ప్రతి నెలా చెల్లించకుండా తన సొంత ఖర్చులకు వాడుకునేవాడు. ఈక్రమంలో సహారా సంస్థను మూసివేయడంతో ఆమెకు రావాల్సిన డబ్బుల కోసం అతడిని అడిగితే.. పొంతనలేని సమాధానం చెప్పేవాడు. దీనిపై అడిగితే తన మేనమామ, ఆయన కొడుకు తనపై దాడి చేశారని గోపాలలక్ష్మి శుక్రవారం మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంస్థ మూసివేసినా.. తన వద్ద అనధికారకంగా డబ్బులు వసూలు చేసేవాడని ఆమె ఆరోపించారు. దీనిపై విచారణ చేసిన అనంతరం వెంకటరావుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు సీఐ విద్యాసాగర్ తెలిపారు.

# గ్రామదేవతల వేడుకలెలా..?

- గ్రామ సతకం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మాణం వద్దు
- వ్యతిరేకిస్తున్న మల్కాపురం గ్రామస్తులు
- అమ్మవార్ల పండగలు ఎక్కడ జరుపుకోవాలని ఆందోళన



మల్కాపురం గ్రామ సతకం పట్టు స్థలంలో మార్కెట్ నిర్వాహకులు వేసుకున్న పరదాలు



గ్రామస్తులు అడ్డుకోవడంతో మార్కెట్‌లో సగంలో ఆగిపోయిన శ్లాబ్

**మల్కాపురం:** వందేళ్లుగా గ్రామదేవతల వేడుకలు నిర్వహిస్తున్న స్థలంలో ఎటువంటి నిర్మాణాలకు అనుమతించబోమని మల్కాపురం గ్రామస్తులు తెగేసి చెబుతున్నారు. ఎంతో చరిత్ర గల ఆ స్థలంలో గ్రామపెద్దలు, గ్రామస్తుల అనుమతులు లేకుండా మార్కెట్ నిర్మాణానికి అధికారులు పూనుకోవడం వివాదాస్పదమైంది. దీన్ని గ్రామంలోని పలు కులాల వారు వ్యతిరేకించారు. గ్రామ సతకం పట్టు స్థలంలో జీవీఎంసీ అధికారులు నిర్మాణాలు చేపడితే తాము ఎక్కడ అమ్మవార్ల పండగలు, జాతరలు జరుపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. దీంతో మార్కెట్ నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.

వివరాల్లోకి వెళ్తే... 61వ వార్డు మల్కాపురం గ్రామం 1925కు ముందు ప్రస్తుతం ఉన్న హెచ్‌పీసీఎల్, ఐవోసీ కంపెనీల వద్ద ఉండేది. నాడు కాల్‌టెక్స్(ప్రస్తుత హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ), ఎస్ఎఫ్ కంపెనీ, బర్మాసెల్ వంటి పరిశ్రమల నిర్మాణాల కోసం అక్కడ గల సుమారు 800 ఎకరాల భూమి తీసుకున్నారు. దానికి బదులుగా ప్రస్తుతం ఉన్న మల్కాపురం వద్ద 1927 ఫిబ్రవరి 11న సుమారు 29 ఎకరాల 25 సెంట్ల భూమిని అక్కడ నివసించే ప్రజల కోసం అప్పటి విశాఖ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్లు ఎం.ఆర్.రాజారావు బహదూర్, శ్రీహరినాయుడు సమక్షంలో కేటాయించారు. నాటి నుంచి సుమారు 12 సామాజిక వర్గాల ప్రజలు ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు.

**మార్కెట్ నిర్మాణం వద్దంటున్న గ్రామస్తులు**

ఈ గ్రామ శివారు సరిహద్దు ప్రాంతమైన ఏడుగుడుల సెంటర్(ప్రస్తుత ప్రకాష్‌నగర్) వద్ద కుంచిమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ తదితర అమ్మవార్లను నెలకొల్పారు. నిత్య పూజలు, ప్రతి ఏటా పండగలు, మూడోళ్లకు ఓసారి ఉత్సవాలు నిర్వహించేందుకు మల్కాపురం మధ్య భాగంలో(ప్రస్తుతం నిర్వహిస్తున్న మార్కెట్ స్థలం) సతకం పట్టుకు సుమారు 15 సెంట్ల భూమి ఉంది. ఈ విశాలమైన స్థలంలో జీవీఎంసీ అధికారులు మార్కెట్ నిర్మాణానికి పదేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. గ్రామపెద్దల అనుమతులు లేకుండా ఆ స్థలంలో కొంత భాగం వరకు శ్లాబ్ వేశారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు, గ్రామస్తులతో కలిసి దీనిని వ్యతిరేకించారు. దీంతో నాడు సగం శ్లాబ్‌తో పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ సుమారు రూ.40 లక్షలతో మళ్లీ మార్కెట్ నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గ్రామంలోని పలు కులస్తులతో పాటు గ్రామపెద్దల్లో ఆగ్రహ జ్వాలలు మొదలయ్యాయి. అమ్మవారి విగ్రహాలు నిలిపే సతకం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మిస్తే తాము ఎక్కడ గ్రామదేవతల ఉత్సవాలు జరుపుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తామని అధికారుల వద్ద వారు హెచ్చరించడంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

### మార్కెట్ నిర్మిస్తే ఊరుకోం



మా గ్రామ ఉత్సవాలు నిర్వహించే సతకం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మించాలని అధికారులు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదు. ఆ స్థలం మల్కాపురంలో జరిగే అమ్మవార్ల ఉత్సవాల కోసం కేటాయించింది. గ్రామ ప్రజలపై అధికారులు, పాలకులకు అంత ప్రేమ ఉంటే జీవీఎంసీకి చెందిన స్థలంలో లేదా ఏదైనా ప్రైవేట్ స్థలం మార్కెట్ ఏర్పాటు చేయండి.

– ఉరుకూటి బాబూరావు యాదవ్, ప్రధాన కార్యదర్శి, మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం

### దీనికి మేము వ్యతిరేకం



గ్రామ సతకం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మించే ఆలోచన సరికాదు. విలువైన, విశాలమైన గ్రామకంఠ స్థలంలో అమ్మవార్ల పండగలు నిర్వహించుకుంటాం. ఆ స్థలంలో మార్కెట్ నిర్మిస్తే మేము ఎక్కడ ఉత్సవాలు జరుపుకోవాలి.

– కాకర ప్రకాష్‌రావు, హరిజన వీధి, మల్కాపురం

### ఆలోచన విరమించుకోవాలి



మల్కాపురం గ్రామ ఉత్సవాలు, వేడుకలు నిర్వహించే స్థలంలో మార్కెట్ నిర్మించాలనే ఆలోచనను అధికారులు విరమించుకోవాలి. ఆ స్థలాన్ని గ్రామదేవతల ఉత్సవాల కోసం అలాగే ఉంచాలి. దానిలో ఎటువంటి నిర్మాణం చేపట్టినా ఊరుకోం. స్థలాన్ని కాపాడుకునేందుకు గ్రామస్తులందరితో కలిసి ఏ పోరాటానికైనా సిద్ధపడతాం.

– బాలుచందర్, శెట్టిబలిజ వీధి

### ప్రస్తుతం పనులు నిలిపివేశాం

61వ వార్డు మల్కాపురం వద్ద ప్రస్తుతం తాత్కాలిక మార్కెట్ నిర్వహిస్తున్న స్థలంలో సుమారు రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో షాపులు నిర్మించడానికి ఇటీవల భూమిపూజ చేశాం. ఇక్కడ శాశ్వత నిర్మాణాలను గ్రామ పెద్దలు, స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఆ స్థలంలో మార్కెట్ నిర్మాణం వద్దని చెబుతున్నారు. ఈ సమస్య కారణంగా పనులు ఆపేశాం. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

– ఏడుకొండలు, జీవీఎంసీ వర్క్స్ డీఈ

## గెడ్డల్లో పూడికలు తొలగించారు



గొల్లకంచరపాలెం గెడ్డలో పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**కంచరపాలెం:** జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెంనుంచి తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న గెడ్డల్లో చెత్తా చెదారాలు తొలగించారు. చెత్త కుండీలను తలపిస్తున్న గెడ్డలు, పూడికలు సక్రమంగా తీయకపోవడంతో పరిసర ప్రాంతాలు వాసుల పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 8న సాక్షి దినపత్రిలో 'గెడ్డలు దుర్గంధభరితం' అనే శీర్షికతో వెలువడిన కథనానికి జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ స్పందించారు.ఆయన ఆదేశాల మేరకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె. రమేష్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది పూడికలు తొలగించారు. గెడ్డల్లో చెత్తా చెదారాలు వేయవద్దని అవగాహన కల్పించారు.

## 31న కౌన్సెలింగ్

**మధురవాడ:** బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నిరసన



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘ నాయకులు

**మల్కాపురం:** కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ,సీఐటీయూ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ,ఎం.జగ్గ నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో కార్మికులు పాల్గొన్నారని.. బీజేపీ పాల్గొన్నట్టు చరిత్ర ఉందా అని ప్రశ్నించారు.బీజేపీ,ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ వారితో నాడు లాలూచి పడి భారతదేశానికి ద్రోహం చేశారని ఆరోపించారు. ఎంతో మంది త్యాగాలు ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబరు కోడ్స్ గా మార్చి హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ కమిటీ నాయకులు పెంటారావు,ఏఐటీయూసీ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- పద్ధతి మారకపోతే చార్జి మెమోలు
- ఎంఈవో సోమేశ్వరరావు



టెన్త్ విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంఈవో

**కంచరపాలెం:** ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి–1 సోమేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, కె.కాలనీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించక పోవడంతో మండిపడ్డారు. తరగతి గదుల్లో పరిశుభ్రత పరిశీలించారు. ట్యాబ్‌లను అల్‌యాప్స్‌తో వినియోగంలోకి తేవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల హాజరు కనిపించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో హాజరు కనిపించని ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ చార్జి మెమో జారీ చేస్తామన్నారు. బాధ్యతగా బోధన చేయాలని ప్రాథమిక పాఠశాలల టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్ శ్రీనివాసరావు, సీఆర్‌పీ లంక చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

**కంచరపాలెం:** మాదకద్రవ్యాల వల్ల ఒనగూరే దుష్ఫలితాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడొద్దని, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్ రాకెట్‌ను మూలాల నుంచి తొలగించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రయత్నిస్తోందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.ఎం.కుమారి డ్రగ్స్ ఫ్రీ దేశంగా తీర్చిదిద్దుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు, డాక్టర్ ప్రవీణ్, ఎస్.రాంబాబు, సురేష్‌బాబు, ప్రియాంకరాణి తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యాలు మెరుగుపర్చాలి



సబ్‌మెరైన్ మ్యూజియం పరిసరాలను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

**విశాఖ సిటీ:** పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, పాడైన వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న ఐఎన్ఎస్ కురుసుర సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియాన్ని సందర్శించారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పరిసరాలను పరిశీలించారు. ఈ పర్యటనలో వీఎంఆర్‌డీఏ సీఈ భవానీశంకర్, ఈఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రాజు, రామరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మురళి, సహాయక ఇంజనీర్ హసీనా బేగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నూకాంబిక ఆలయ ముఖ ద్వారం ప్రతిష్ట



ఆలయ ముఖద్వార ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మహిళలు, కమిటీ సభ్యులు

**సింథియా:** జీవీఎంసీ 62వ వార్డు పరిధి టీడీపీకాలనీలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వార ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మాలినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయ ముఖద్వారాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన కాకర అప్పారావు

**కొమ్మాది:** పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బావిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలివీ.. పూర్ణామార్కెట్‌కు చెందిన కాకర అప్పారావు (41) వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఊరు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఓజోన్ వ్యాలీ రోడ్డు దరి ఓ బావిలో విగత జీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో పీఎం పాలెం పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా స్థాయి చెస్ టోర్నీ నేడు

**గాజువాక:** ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గాజువాకలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాల కోటేశ్వరరావు తెలిపారు. అండర్–13 కేటగిరీలో ఓపెన్, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. జగ్గు జంక్షన్ సమీపంలోని లయన్స్ క్లబ్‌లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. వివరాలకు 70103 19715 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# వసతుల కల్పనతోనే సమర్థవంతంగా విధుల నిర్వహణ



సిబ్బందికి నూతన కిట్ బాక్సులను అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి
- పోలీస్ సిబ్బందికి నూతన కిట్ బాక్సుల అందజేత

**విశాఖ సిటీ:** పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్‌బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్స్‌లు అందజేత, మరుగుదొడ్లు పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఎక్కడ పని ఉంది? ఏమేం కావాలో తెలియజేస్తే ఆ ప్రకారం ఆయా పనులు చేయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. తన నంబర్ 79950 95799కు తెలియజేసిన కిట్‌బాక్స్, మరుగుదొడ్లు, హ్యాండ్ కఫ్స్, వెహికల్ పార్కింగ్‌కు షెడ్లు, విశ్రాంతి కోసం మెన్ వెయిటింగ్ హాల్, ఇలా అన్ని సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే ముద్దాయిల ఎస్కార్ట్ విధులకు తగ్గించాలన్న సిబ్బంది విజ్ఞప్తిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కచ్చితంగా అవసరమైతే తప్పా మిగిలిన అన్ని సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముద్దాయిలను ప్రొడ్యూస్ చేసే విధానం పరిశీలించాలని అభ్యర్థన లేఖను ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించారు. తమ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు



అష్టలక్ష్ముల వేషధారణల్లో విద్యార్థులు

**మల్కాపురం:** శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా శ్రావణలక్ష్మి పూజలను పారిశ్రామిక ప్రాంతంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐవోసీ వద్ద గల చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

- శ్రీహరిపురంలోని హరిహర క్షేత్రంలో శ్రావణలక్ష్మి పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు.అనంతరం శ్రావణలక్ష్మి కీర్తనలు ఆలపించారు.
- 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించారు. విద్యార్థినులు అష్టలక్ష్ముల వేషధారణల్లో అలరించారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

**విశాఖ సిటీ:** జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

# ఔరా.. కర్ర పెండలం



**సీతమ్మధార :** సీతమ్మధార రైతుబజార్‌లో ఒక కర్ర పెండలం దుంప ఔరా అనిపించింది. కశింకోట మండలం తోటకూరపాలేనికి చెందిన రైతు సన్యాసిరావు తన పొలంలో పండించిన కర్ర పెండలం 5.10 అడుగుల పొడవు ఉంది. ఈ దుంప ఐదు కిలోల బరువు తూగింది. సాధారణంగా కర్ర పెండలం కేవలం అడుగున్నర పొడవు మాత్రమే ఉంటుంది. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్‌కు సన్యాసిరావు ఈ కర్ర పెండలం అందజేశారు.

# పెండింగ్ చలానాల వసూలుకు స్పెషల్ డ్రైవ్



పాత గాజువాక జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారుల నుంచి చలానాలు వసూలు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

**గాజువాక :** ద్విచక్ర వాహనదారుల నుంచి పెండింగ్ చలానాల వసూలుకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించడం వంటి కారణాలతో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, వాహనదారులు వివిధ కారణాల రీత్యా చలానాలు చెల్లించడం లేదు. తమ వాహనంపై కేసు నమోదైన విషయం తెలియక కొందరు, కేసు విషయం తెలిసినా తర్వాత చూద్దాంలే అని మరికొందరు.. ఇలా చలానాలను పెండింగ్‌లో ఉంచేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు పెండింగ్ చలానాలు వసూలు చేయాలని ఆదేశించడంతో గాజువాకలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో ఎస్ఐలు, సిబ్బంది ఎక్కడికక్కడ వాహనాలు ఆపి చలానాలు వసూలు చేశారు.